క్లుప్తంగా

కమిషనర్‌గా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



ఏలేశ్వరం: ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్‌గా ఎం.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ కె.శివప్రసాద్ విశాఖపట్టణం జోనల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు తెలిపారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం దసరా ఉత్సవాలకు పందిరి రాట వేశారు. స్థానిక దిబ్బలపాలెంలో సంతోషి మాత ఆలయం వద్ద రంజిత్ చక్రవర్తి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శరన్నవరాత్రులకు రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, శిడగం త్రివేణి పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దుర్గాదేవి ఆలయం, తోటవీధిలో దుర్గమ్మ గుడి, నర్సీపట్నం రోడ్డులో అమ్మవారి ఆలయాల వద్ద పందిరి రాట వేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే నెల 3వ తేదీ నుంచి 12 వరకూ విజయ దశమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.


కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తుని రోటరీ క్లబ్ హాలులో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుని: స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని రోటరీ క్లబ్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్, హైమా నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 176 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు రోటరీ క్లబ్ తుని శాఖ కార్యదర్శి ఎస్.వీర్రాజు తెలిపారు. వీరిలో 80 మందికి ఉచితంగా కళ్లజోళ్లు, 46 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు కోశాధికారి కిశోర్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ పని చేస్తోందన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైమా నేత్రాలయ అధినేత డాక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్, డాక్టర్లు ఎ.హరికృష్ణ, పి.ప్రసాద్, ఎస్వీ సుబ్బారావు, రాజశేఖర్, వెంకట నాగరాజు, రామచంద్రరావు, సాయి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్లిన ఎంపీడీఓకు సత్కారం



ఎంపీడీఓను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అధికారులు

గండేపల్లి: శ్రీకాకుళం జిల్లా పలాసకు బదిలీ అయిన జగ్గంపేట ఎంపీడీఓ వసంత్‌కుమార్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో అధికారులు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులకు విధి నిర్వహణలో అందించిన సేవలతోనే గుర్తింపు వస్తుందన్నారు. ఎంపీడీఓ వసంత్‌కుమార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ ఎంపీపీ మారిశెట్టి భద్రం, జగ్గంపేట ఆర్యవైశ్య సేవాసంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు, తహసీల్దార్ శ్రీరామ్, ఏపీఓ కృష్ణరాజు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీ చౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్ శర్మ అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

అందని సాయం.. రైతుకు గాయం

- పక్కదారి పట్టిన తుపాను సహాయ నిధులు
- నష్టపోయిన రైతులు
- న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

శంఖవరం: మిచౌంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు అందాల్సిన నష్ట పరిహారం సొమ్ములు పక్కదారి పట్టాయి. 2023లో వచ్చిన మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో 147.57 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లింది. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా రూ.25.08 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులను అధికారుల సాయంతో స్థానిక నేతలు అక్రమార్గంలో దోచేశారు. రైతుల ఖాతాల్లో జమ కావలిసిన సొమ్ము అక్రమార్గంలో నేతలు, వారి బంధువుల ఖాతాల్లో జమ అయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమంది రైతులకు పంట నష్ట పరిహారం అందినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని శంఖవరం, అచ్చంపేట, ఎస్.జగ్గంపేట, జి.కొత్తపల్లి గ్రామాల్లో సుమారు 50 మంది రైతులు నేతల అక్రమార్జనకు నష్టపోయారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై ఇటీవల కాకినాడ జిల్లా కలెక్టర్‌కు షణ్మోహన్ సగిలికు 20 మంది రైతులు ఫిర్యాదు చేశారు.



శంఖవరంలో కొట్టుకుపోయిన వరి పంట (ఫైల్)

భూమి రైతులది పరిహారం నేతలకు...

మండల కేంద్రమైన శంఖవరంలో మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో 80 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారాన్ని విడుదల చేసింది. రైతుల భూములను తాము కౌలుకు చేసుకున్నట్లు స్థానిక నేతలు రికార్డులు సృష్టించారు. దీంతో రైతుల ఖాతాలో జమ కావల్సిన పంట నష్టం నేతల ఖాతాల్లో పడిందని రైతులు ఆరోపిస్తున్నారు.

అధికారుల సాయంతో దందా

నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పనిచేస్తే శంఖవరంలో సంబంధిత అధికారులు దానికి భిన్నంగా స్థానిక నేతలకు సాయం అందేలా వ్యవరించారు. రైతులకు అందాల్సిన పంట నష్ట పరిహారం రైతులకు అదకుండా నేతలకు అందేలా పనిచేశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

నష్ట పరిహారం కోసం ఎదురుచూపులు

ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టి రైతులు వరి సాగు చేశారు. పంట చేతికి అందే దశలో ఒక్కసారిగా వరదలు వచ్చి పనలపై ఉన్న వరి, నూర్చిన ధాన్యం రాశులు కొట్టుకుపోవడంలో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అప్పటి ప్రభుత్వం తుపాను సాయం ప్రకటించడంతో రైతుల్లో ఆనందం కలిగింది. అధికారులకు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి నష్ట పరిహారం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎనిమిది ఎకరాల్లో పంట నష్టం



గత ఏడాది 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. పంట చేతికి వచ్చే సమయానికి మిచౌంగ్ తుపాన్ కారణంగా వరదలు వచ్చి కోసి పనలపై ఉన్న వరిపంట కొట్టుకుపోయింది. సంబంధిత అధికారులు న్యాయం చేస్తారని ఎదురు చూస్తున్నాను.

గవరసాని మాణిక్యాలు, రైతు, శంఖవరం

భూమి నాది పరిహారం వేరొకరికి ..



నేను 40 ఏళ్లుగా వరి పండిస్తున్నాను. గతంలో తుపాన్ కారణంగా పంటకు నష్టం వాటిల్లితే నేరుగా నా ఖాతాలోనే సొమ్ములు జమయ్యేవి. గతేడాది 6 ఎకరాల్లో వరి సాగు చేశాను. మిచౌంగ్ తుపాన్ కారణంగా పంట నీట మునిగింది. అధికారులు వచ్చి మనిగిన వరి పంటను పరిశీలించారు. నాకు నష్ట పరిహారం అందుతుందనుకున్నారు. కాని నా భూమిలో వేరొక్కరు పంట పండించినట్లు రికార్డులు సృష్టించి, వారికి నష్టపరిహారం అందేలా అధికారులు పనిచేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పర్వత సోమన్నదొర, (బాబ్జి) రైతు, శంఖవరం

హైవేపై అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

తుని రూరల్: జాతీయ రహదారి వెంబడి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్న కేశవరావు శుక్రవారం హెచ్చరించారు. హైవేపై వెళ్లొచ్చే వాహనాల నుంచి ఇనుము, ఆయిల్ వంటి అక్రమాలు, దోపిడీలకు పాల్పడే ముఠాలు, అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యహరిస్తామన్నారు. ఇందుకు ఎవరైన స్థావరాలు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడేవారి వివరాలు ఇచ్చేవారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జాతీయ రహదారిపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వాహనదారులు, ప్రయాణికులు, సమీప గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ధర్మవరంలో స్వచ్ఛతా హి సేవ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత, పరిశుభ్రతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బెంతుకుర్తి సుశీల మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ జువ్వల బాబులు, స్థానిక నేతలు బెంతుకుర్తి అబ్బాయి, దాడ్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, దాసం శేషారావు, ఊట వీరబాబు, దాట్ల కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూక్లియర్ సైన్స్‌తో అభివృద్ధి

రాష్ట్ర కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ కృష్ణ

ఏలేశ్వరం: న్యూక్లియర్ సైన్స్‌తో మానవాళి అభివృద్ధి జరిగిందని రాష్ట్ర కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డి.సునీత అధ్యక్షతన విశాఖపట్టణం బాబా అటమిక్ రీసెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య రక్షణ శక్తి, పర్యవరణంలో న్యూక్లియర్ సైన్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ న్యూక్లియర్ సైన్స్ అభివృద్ధి చెందిన తరువాత మానవాభివృద్ధిలో పెనుమార్పులు సంభవించాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం, కొత్తరకాల మందులు కనిపెట్టడం, మానవ జీవిత కాలం పెంచడంలో న్యూక్లియర్ సైన్స్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అనంతరం భౌతిక శాస్త్ర పరిశోధనలపై శాస్త్రవేత్త డాక్టర్ జగన్నాథరాజు, ఇండియన ఫ్యూజన్ ప్రోగ్రాంపై శాస్త్రవేత్త కె.రాఘవేంద్ర విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

తొండంగి: మండలంలోని బెండపూడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు ఎంఈవో షేక్ బాబ్జి శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. హాకీ అండర్-16 విభాగంలో బెండపూడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దార్ల హరీష్, అండర్-14 విభాగంలో యడ్ల రాకేష్ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు హరీష్, రాకేష్‌లను అభినందిస్తున్న దృశ్యం

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

తుని: జాతీయస్థాయి ఖోఖో పోటీలకు స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికై నట్టు ఆ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మూర్తి శుక్రవారం తెలిపారు. సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం బచ్చుపల్లిలో ఇటీవల క్లస్టర్-7 ఖోఖో పోటీలు నిర్వహించారు. అండర్-14 విభాగంలో శ్రీప్రకాష్ విద్యార్థులు లాలం పూర్ణశ్యామ్ నాయుడు బృందం, అండర్-19 విభాగంలో జి.ధనుష్ బృందం ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించారన్నారు. వచ్చె నెల 16 నుంచి 19 వరకూ మధ్యప్రదేశ్‌లోని దేవాస్ దినరదన ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో జి.కావ్య సుధ బృందం తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం గెలుచుకున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అదినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, కోచ్‌లు చిరంజీవి, హేమ, ఉపాధ్యాయులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న నరసింహారావు

అంబేడ్కర్‌కు ఘన నివాళులు

ప్రత్తిపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర పర్యటన చేసి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ప్రత్తిపాడులో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ బ్రిటిష్ కౌన్సిల్ మెంబర్ (కార్మిక శాఖ)గా నియమితులైన తర్వాత తొలిసారిగా 1944 సెప్టెంబర్ 27న రాష్ట్రంలోని విశాఖ, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కాకినాడ, రామచంద్రాపురం, పాలకొల్లు, ఏలూరు, గుడివాడలో పర్యటించారు. ఆయన పర్యటనను స్మరించుకుంటూ స్టానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద ఉన్న అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కళామందిర్ కమిటీ సభ్యులు మూరా చిన్ని, రాణా, మూరా నాగేంద్ర, కందిమళ్ల సామ్యేలు, ఈరుగుల చక్రం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

ఏలేశ్వరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు తామంతా వ్యతిరేకమన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గ్రామాల్లో పర్యటించి మాలలను సంఘటితం చేస్తామన్నారు. దశల వారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనిపై భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుప్పల నాగభూషణం, నూకతాటి సతీష్, బత్తిన శ్రీనివాస్, కొండబాబు, బాబులు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సమితి సభ్యులు

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్‌గా డేనియల్



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్‌గా వీవీ డేనియల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. పిఠాపురంలో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న డేనియల్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన డేనియల్‌కు కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు స్వాగతం పలికారు.

తుని సబ్ రిజిస్ట్రార్‌గా సుబ్బారెడ్డి



తుని: ప్రజలకు సత్వర సేవలు అందిస్తామని సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం తుని సబ్ రిజిస్ట్రార్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన సీహెచ్‌వీవీ సత్యనారాయణ కోనసీమ జిల్లా అల్లవరానికి బదిలీపై వెళ్లారు. ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన సుబ్బారెడ్డి ఇక్కడకు వచ్చారు. క్రయ, విక్రయాలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా వ్యవహరిస్తామన్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, లేఖరులు స్వాగతం పలికారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

కోటనందూరు: వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని డ్రగ్ టీడ్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు గుండు గిరిధర్ సూచించారు. స్థానిక ×ఓ¥ కల్యాణ మండపంలో డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బొమ్మిడి నాగేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గిరిధర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి మెడికల్ షాపుల్లో మందులు విక్రయించాలన్నారు. కాలం చెల్లిన, నాసిరకం మందుల అమ్మకాలకు తావు లేదన్నారు. ప్రతి దుకాణంలో సీసీ కెమెరా, శుభ్రత పాటించాలన్నారు. వినియోగదారులతో సత్సంబంధాలు పెంచుకొని కార్పొరేట్ దుకాణాలకు దీటుగా సేవలందించాలని సూచించారు. కెమిస్టుల సంక్షేమమే లక్ష్యంగా అసోసియేషన్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగలపల్లి గుప్తా, జిల్లా ట్రెజరర్ సాధనాల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి విజయ్, ట్రెజరర్ షేక్ బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గిరిధర్

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

తుని: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఏటా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు భారత్ వికాస్ పరిషత్ తుని శాఖ అధ్యక్షుడు లక్ష్మణాచార్యులు తెలిపారు. స్థానిక బ్యాంకు కాలనీ సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం భారత్ కో జానో క్విజ్ పోటీలు నిర్వహించారు. తుని, పాయకరావుపేట పట్టణాల్లో పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. క్విజ్ పోటీలు సీనియర్ విభాగంలో తుని మండలం ఎస్.అన్నవరం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన టి.అమన్, డి.గౌతమ్ ప్రథమస్థానం కై వసం చేసుకున్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థలకు చెందిన రమ, ఎస్.గీతిక ద్వితీయ స్థానం పొందారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం కె.విశ్వనాథ్, టానిష్య, ద్వితీయ స్థానం శ్రీప్రకాష్‌కు చెందిన వీవీ సుబ్రహ్మణ్యం, నీతూ నిర్మల్ గెలుచుకున్నారు. వీరికి బీవీపీ తుని శాఖ గౌరవాధ్యక్షుడు ఎంవీ సూర్యనారాయణరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీవీపీ కార్యదర్శి ఆశిన సత్యనారాయణ, కోశాధికారి శంకర్, కన్వీనర్ డేనియల్ జోసెఫ్, చదరం శివాజీ, వేణు గోపాల స్వామి, ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.



క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీవీపీ ప్రతినిధులు

ఘనంగా పారాయణలు

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం మహిళలు పలు పారాయణలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శివస్తోత్రాలు, లలితా సహస్ర నామ పారాయణాలు చేశారు. అనంతరం దుర్గాదేవి భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరిటీ, సంఘ సభ్యులు ఉడతల రమణారావు, కామాక్షి, రమాదేవి, హైమావతి, సుభాషిణి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమ్మకు చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కోట వంశీ, ఫణి శర్మ, చెళ్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 40 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రుత్విక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ దిగువన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అర్చకులు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో రుత్విక్కులు కుంకుమార్చనలు నిర్వహించారు.

అప్పన్నపాలెంలో ప్రజావేదిక

ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా పట్టణ పరిధిలోని 8వ వార్డు (అప్పన్నపాలెం)లో శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో సభ జరిగింది. వంద రోజుల పాలనపై ఎమ్మెల్యే ప్రసంగించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలన పోస్టర్లను అతికించారు. ప్రజలు అంతంతమాత్రంగానే హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జోరు వాన



ఏలేశ్వరంలో చెరువును తలపిస్తున్న కోనేటి బడి మైదానం

- పల్లపు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన వంట పొలాలు

ఏలేశ్వరం: అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం తెలవారుజాము నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. భారీవర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో రహదారులు, పంట పొలాలు నీటమునిగాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు జనం ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పట్టణంలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. ప్రధానరహదారులు నిర్మానుష్యంగా మారాయి. మండలంలోని యర్రవరం, తిరుమాలి, సిరిపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.



గాదెలపాలెం శివారున రహదారిపై నేలకొరిగిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

గోకవరంలో భారీ వర్షం

గోకవరం: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షం కారణంగా గాదెలపాలెం, ఇటికాయలపల్లి గ్రామాల మధ్య రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ సభ్యుడు గల్లా కృష్ణ, భూపతిపాలెం పాఠశాల చైర్మన్ గల్లా రాములు స్థానికుల సహాయంతో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

గోకవరం విద్యుత్‌శాఖ ఏఈగా సుబ్రహ్మణ్యం

గోకవరం: గోకవరం విద్యుత్‌శాఖ ఏఈగా సుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఏఈగా పని చేస్తున్న అశోక్ సాధారణ బదిలీల్లో భాగంగా పేరవరం మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజానగరం ఏఈగా పని చేస్తున్న సుబ్రహ్మణ్యం ఇక్కడకు వచ్చారు. గతంలో ఆయనకు గోకవరంలో పని చేసిన అనుభవం ఉంది. మండల ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన ఏఈ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రత్తిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో పట్టుబడిన నిందితులకు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా లేదా మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి జి.బుల్లెమ్మ శుక్రవారం తీర్పు నిచ్చారు. స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న ఏడుగురు నిందితులను ఆయాస్టేషన్ల ఎస్సైలు ఎం. పవన్‌కుమార్, ఎన్.రామలింగేశ్వరరావు, కిషోర్ అరెస్టు చేశారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా లేదా మూడేసి రోజుల జైలు శిక్ష విధించారని సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపారు.

హామీలు నెరవేరుస్తాం

గండేపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కావడంతో ఇది మంచి ప్రభుత్వం పేరిట జగ్గంపేటలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్గంపేటలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.11.50 కోట్ల నిధులు తెచ్చినట్టు తెలిపారు. పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ క్యాంపస్‌లో శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించినట్టు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ విభాగం, కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.రాజశేఖర ఫణీంద్ర, ఎస్.నాని బాబు, తదితరులు పాల్గొన్నారు.